సకాలంలో చెల్లిస్తేనే వడ్డీ రాయితీ

- ఒక్కరోజు దాటినా రాయితీ హుష్‌కాకే..!
- వ్యవసాయ రుణాల చెల్లింపులో అవగాహన లేమి
- ఏడాదికి ఒక్కరోజు దాటినా వడ్డీ భరించాల్సిందే అంటున్న బ్యాంకర్లు


రామాపురం బ్యాంకులో రుణాల రెన్యూవల్ కోసం బారులుతీరిన రైతులు

బత్తలపల్లి: వ్యవసాయ రుణాల చెల్లింపులో రైతులకు సరైన అవగాహన లేక వడ్డీ రాయితీని పొందలేకపోతున్నారు. దీనిపై క్షేత్రస్థాయిలో ప్రచారం లేకపోవడంతో అన్నదాతలు భారీగా ప్రభుత్వ లబ్ధిని కోల్పోతున్నారు. దీంతో పాటు వడ్డీని కూడా చెల్లించాల్సి వస్తోంది. సాధారణంగా మే నుంచి ఆగస్టు నెలఖారు వరకు ఖరీఫ్ సీజన్‌లో రైతులు బ్యాంకుల్లో ఉన్న పాత పంట రుణాలు చెల్లించి, కొత్త రుణాలు పొందడం ఆనవాయితీ. నిబంధనల ప్రకారం ఖాతా పుస్తకంలో రుణం తీసుకున్న తేదీ ప్రాతిపదికన ఏడాదిలోపు చెల్లిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న వడ్డీ రాయితీ పొందే అవకాశం ఉంటుంది.

వడ్డీ వసూలు ఇలా..

పంట రుణాలకు బ్యాంకులు సాధారణంగా ఏడాదికి 7 శాతం వడ్డీ వసూలు చేస్తాయి. ఏడాది దాటితే 13.5 శాతం పెరిగిపోవడమే కాకుండా వడ్డీ రాయితీ కూడా వర్తించదు. ఏడాదిలోపు చెల్లించే రైతులకు రూ.లక్ష వరకు కేంద్ర ప్రభుత్వం 3 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 4 శాతం రాయితీ వారి ఖాతాల్లో జమ చేస్తుంది. అంటే వడ్డీ పూర్తిగా మాఫీ అవుతుంది. ఇందుకోసం రైతులు బీమా చేయించుకుంటే సరిపోతుంది. ఇక బంగారు ఆభరణాలపై రుణాలు తీసుకున్న రైతులకు 9 శాతం వడ్డీ వసూలు చేస్తుంది.

పరిస్థితి ఇలా..

ధర్మవరం నియోజకవర్గంలోని ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాల్లో ఏటా ఖరీఫ్ సీజన్‌లో దాదాపు 70 వేల హెక్టార్లలో వేరుశనగ, ఆముదం, కంది తదితర పంటలు సాగు చేస్తుంటారు. కొన్నేళ్లుగా వరుస కరువులతో రైతులు ఆర్థికంగా చితికిపోయారు. రుణమాఫీ కూడా సరిగా కాక అల్లాడిపోతున్నారు. రుణాలు సకాలంలో రెన్యూవల్ చేయలేక రాయితీని కోల్పోవాల్సి వస్తోంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వమే సకాలంలో రెన్యూవల్ చేయాలని రైతులు కోరుతున్నారు. అయితే తీసుకున్న రుణాలు ఏడాదిలోపు చెల్లిస్తేనే వడ్డీ రాయితీ వర్తిస్తుందని ఒక్క రోజు దాటినా వడ్డీ మొత్తం చెల్లించాల్సి ఉంటుందని బ్యాంకు అధికారులు పేర్కొంటున్నారు.

ధర్మవరం నియోజకవర్గంలో పంట రుణాల రెన్యూవల్ వివరాలు..

మండలం	మొత్తం రైతులు	రెన్యూవల్ చేసుకున్న రైతులు (అంచనా)
ధర్మవరం	18,740	10,000
బత్తలపల్లి	11,779	8,000
తాడిమర్రి	13,584	9,000
ముదిగుబ్బ	18,394	10,500

సీజన్ అంతా అవకాశం ఇవ్వాలి


బ్యాంకులో వ్యవసాయ రుణాలు పొందిన రైతులకు రుణాలు రెన్యూవల్ చేసేందుకు ఒక్క రోజు గడువు పెట్టడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఖరీఫ్ సీజన్‌లో ప్రారంభం నుంచి ముగిసే వరకు గడువు ఇవ్వాలి. తద్వారా రైతులందరూ తమ పంట రుణాలను రెన్యూవల్ చేసుకుని ప్రభుత్వం అందించే రాయితీని పొందుతారు. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలి.
– కమతం కాటమయ్య, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు, బత్తలపల్లి

ఆర్థికంగా ఇబ్బందులు


ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు, పిల్లలను బడికి పంపేందుకు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతుంటాం. ఇదే సమయంలో పంట రుణాలు రెన్యూవల్ కూడా జరుగుతుంటాయి. ఈ ఒత్తిళ్లలో రెన్యూవల్ గడువు ఆలోచన ఉండదు. ఏడాది గడువు గురించి అవగాహన లేకపోవడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నాం.
–ప్రతాప్‌రెడ్డి, రైతు, ఎం.చెర్లోపల్లి, బత్తలపల్లి

జూలై 15లోపు రుణాలు పొందాలి


రైతులు జూలై 15వ తేదీలోగా రుణాలు పొందితే, బీమా పొందే అవకాశం ఉంటుంది. జూలై 15 తరువాత రుణాలు తసుకున్న రైతులకు బీమా లబ్ధి చేకూరదు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తే వడ్డీ రాయితీ పొందే అవకాశం ఉంటుంది. రైతులు ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలి. సంవత్సరంలోపు బ్యాంకు రుణాలు తీర్చడానికి ప్రయత్నించాలి.
– ఓబిరెడ్డి, వ్యవసాయాధికారి, బత్తలపల్లి

రాయితీని వినియోగించుకోవాలి


రైతులు తీసుకున్న రుణాలు సంవత్సరంలోపు చెల్లించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న వడ్డీ రాయితీని వినియోగించుకోవాలి. సంవత్సరానికి ఒక్క రోజు దాటినా ప్రభుత్వం అందజేసే రాయితీని కోల్పోతారు. దీంతో రైతులు నష్టపోయే అవకాశం ఉంది. ఈ విషయాన్ని బ్యాంకు అధికారులు రైతులకు తెలియజేస్తూనే ఉన్నారు.
– సుభాష్, మేనేజర్, ఎస్‌బీఐ బత్తలపల్లి శాఖ

క్లుప్తంగా

చంద్రమౌళీశ్వర స్వామికి పూజలు


ఆలయంలో ప్రతిష్ఠించిన త్రిపుర సుందరీదేవి సమేత చంద్రమౌళీశ్వర స్వామి విగ్రహం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని షిర్డీ సాయిబాబా ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన త్రిపుర సుందరీ దేవి సమేత చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో గురువారం విగ్రహ స్థిర ప్రతిష్ఠను వేదమంత్రాల నడుమ నిర్వహించారు. షిర్డీ సాయిబాబా సేవా సమితి సభ్యుల సమక్షంలో తెల్లవారుజామున 5 గంటల నుంచి మధ్యాహ్నం వరకు వేదమంత్రాలు మంగళ వాయిద్యాల నడుమ త్రిపుర సుందరిదేవి సమేత చంద్రమౌళీశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠను జరిపించారు. అనంతరం మహా కుంభాభిషేకం నిర్వహించారు. రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, సమస్త దేవతల మూల మంత్ర హోమాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వీరనారాయణ, రామలింగయ్య, సూర్యప్రకాష్, రాంప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ట



కనగానపల్లి: మండల కేంద్రమైన కనగానపల్లిలో గురువారం అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. గ్రామంలో కొత్తగా నిర్మించిన ఆలయంలో గత రెండు రోజుల నుంచి వేద పండితులు హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మూడోరోజు గురువారం వేకువజామున అయ్యప్ప విగ్రహాన్ని వేద మంత్రోచ్ఛరణలతో గర్భ గుడిలో ప్రతిష్ఠించారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు


గాయపడిన రహంతుల్లా

తనకల్లు: మండల పరిధిలోని కొక్కంటిక్రాస్‌లో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రహంతుల్లా అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. మారెప్పగారి పల్లికి చెందిన రహంతుల్లా వ్యక్తిగత పనిమీద కొక్కంటి క్రాస్‌కు వచ్చాడు. అయితే చెక్‌పోస్టు సమీపంలోకి రాగానే బొలెరో వాహనం ఢీ కొంది. ఈ ప్రమాదంలో రహంతుల్లా తల, కాళ్లకు బలమైన గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వందేమాతరం టీం సభ్యులు తమ ఉచిత అంబులెన్స్‌లో క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం తనకల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

యోగాతో మానసిక ప్రశాంతత


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్డీఓ మహేష్, యోగా సాధకులు

ధర్మవరం అర్బన్: ఆరోగ్యానికి దోహదపడే ముద్రలు, ఆసనాలు ప్రతి ఒక్కరికి అవసరమని ఆర్డీఓ మహేష్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గురువారం ఆరోగ్యానికి ఉపకరించే ముద్రలు, ఆసనాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రోజూ యోగా చేయడం అలవర్చుకోవాలని సూచించారు. ధ్యానం చేయడం వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుందన్నారు. విలువలతో కూడిన జీవితం మానసిక ప్రశాంతత ఇస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని సూచించారు.కార్యక్రమంలో మున్సిపల్ టీపీఓ పెనుబోలు విజయభాస్కర్, యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గాజుల సోమేశ్వర్‌రెడ్డి, ఆదర్శ సేవా సంఘం అధ్యక్షుడు భీమిశెట్టి కృష్ణమూర్తి, గౌరవాధ్యక్షుడు సూర్యప్రకాష్, కార్యదర్శి నాగార్జున, సభ్యులు నాగరాజు, నాగభూషణం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బక్రీద్ ప్రశాంతంగా జరుపుకోండి

పుట్టపర్తి టౌన్: జిల్లా వ్యాప్తంగా బక్రీద్ పండుగను ముస్లింలు ప్రశాంతంగా జరుపుకోవాలని పోలీసులు సూచించారు. ఎస్పీ ఆదేశాల మేరకు గురువారం జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లలో పీస్ కమిటీలు, మత పెద్దలతో సీఐలు, ఎస్‌ఐలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. చిన్న సమస్య వచ్చిన వెంటనే పోలీస్ అధికారులకు తెలియజేయాలన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

అమడగూరు: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని పోలీసులు పేర్కొన్నారు. గురువారం గుండువారిపల్లిలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ.. ప్రజలకు పోలీసుల అవసరం ఎప్పుడున్నా 100 డయల్ చేస్తే వెంటనే స్పందించడం జరుగుతుందన్నారు. అలాగే మీ ప్రాంతాల్లో ఎవరైనా అనుమానిత వ్యక్తులు తిరుగుతున్నా వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. బాల్య వివాహాలు జరిపిస్తే వధూవరులతో పాటుగా ఇరువురి తల్లిదండ్రులు కూడా శిక్షను అనుభవించాల్సి ఉంటుందన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతుంటే మాకు తెలియజేయాలన్నారు. కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తే నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రైనీ డీఎస్పీ, జమేదారు సుధాకర్, సర్పంచ్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

కొత్త స్కూళ్లకు అనుమతులు ఇవ్వొద్దు


ఎంఈఓ చాముండేశ్వరికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

బత్తలపల్లి: మండల కేంద్రంలో కొత్తగా పాఠశాలల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వొద్దని ప్రైవేట్ పాఠశాలల యజమానులు కోరారు. గురువారం ఎంఈఓ చాముండేశ్వరిని కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్‌లు లక్ష్మీనారాయణ, లక్ష్మీ, వెంకటరాముడు, క్రిష్ణ మాట్లాడుతూ.. బత్తలపల్లిలో ఇప్పటికే ఐదు పాఠశాలలు గత 20 సంవత్సరాలు నుంచి కొనసాగుతున్నాయన్నారు. ఉన్న పాఠశాలలకే అరకొరగా విద్యార్థులు వస్తున్నారన్నారు. మరో కొత్త స్కూలు రావడం వలన ఉన్న పాఠశాలలే ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. అదేవిధంగా ఆర్థిక ఇబ్బందులు ఏర్పడి టీచర్లకు వేతనాలు ఇవ్వలేని పరిస్థితి వస్తుందన్నారు. న్యూ ఎడ్యుకేషన్ పాలసీ ప్రకారం బత్తలపల్లికి మరొక కొత్త స్కూల్ అవసరం లేదన్నారు.

ప్రతిభా అవార్డులకు ఎంపిక


మౌనిక


షేక్ నాజియా


శాంతియా


అరిగెల దివ్య

ధర్మవరం అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అందించే ప్రతిభ అవార్డులకు వాసవి బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ చిత్రా ఈశ్వరయ్య, డైరెక్టర్ భాస్కర్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం వివిధ కేటగిరీల కింద ప్రతిభ అవార్డులు అందజేయనుంది. జిల్లా వ్యాప్తంగా 38 మంది విద్యార్థులు ఎంపికకాగా.. ధర్మవరం పట్టణానికి చెందిన నలుగురు విద్యార్థినులు ఎంపికయ్యారు. తమ కళాశాలకు చెందిన విద్యార్థినులు బీసీ కేటగిరీలో శాంతియా (బైపీసీ–987), జనరల్ కేటగిరీలో అరిగెల దివ్య (బైపీసీ–984), ఎస్సీ కేటగిరీలో మౌనిక (ఎంపీసీ–979), దివ్యాంగుల విభాగంలో షేక్ నాజియా (సీఈసీ–832) ఎంపికయ్యారు. ప్రతిభ అవార్డులకు ఎంపికైన విద్యార్థినులను సిబ్బంది అభినందించారు.

‘వెన్నుపోటు దినం’ విజయవంతంపై హర్షం


శ్రీధర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబులపతి

పుట్టపర్తి: కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం నిర్వహించిన వెన్నుపోటు దినం కార్యక్రమం విజయవంతం కావడంపై మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమానికి హాజరైన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. అన్ని వర్గాల వారిని కూటమి ప్రభుత్వం దారుణంగా మోసం చేసిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కడం చంద్రబాబు నైజమని విమర్శించారు. రాబోవు రోజులలో మరిన్ని ఉద్యమాలు చేసి ప్రజల పక్షాన పోరాడతామన్నారు.

పుట్టపర్తి టౌన్: మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పుట్టపర్తి పట్టణంలో నిర్వహించిన వెన్నుపోటు దినం కార్యక్రమం విజయవంతంపై వైఎస్సార్‌సీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పట్టణ కన్వీనర్ రవినాయక్ ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పుట్టపర్తి పట్టణంలో నిర్వహించిన వెన్నుపోటు దినం కార్యక్రమానికి వేల సంఖ్యలో నాయకులు కార్యకర్తలు తరలిరావడం హర్షణీయమన్నారు. సహకరించిన మండల కన్వీనర్లు, ఎంపీపీ, జెడ్పీటీసీ, కౌన్సిలర్లకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబుళపతి, వైస్ చైర్మన్ తిప్పన్న, జిల్లా అధికారి ప్రతినిధి ఫొటో సాయి, పట్టణ కన్వీనర్ రవినాయక్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆంజనేయులు, నాయకులు కేశప్ప, రామయ్య, రమేష్, పాదయాత్ర శంకర్ తదితరులు పాల్గొన్నారు.

విత్తన వేరుశనగకు రిజిస్ట్రేషన్ చేసుకోండి


తాడిమర్రిలో రిజిస్ట్రేషన్ చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

కదిరి అర్బన్: మండలంలో సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలుకావాల్సిన రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లో విత్తన రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏఓ శ్రీనివాసరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కే6, టీసీజీఎస్–1694 రకం విత్తన వేరుశనగ 30 కేజీల బస్తా పూర్తిధర రూ.2,790 కాగా 40 శాతం సబ్సిడీ పోను రైతు వాటాగా రూ.1,674 చెల్లించాలన్నారు. కదిరి లేపాక్షి రకం 30 కేజీలు రూ.2,460 కాగా సబ్సిడీ పోను రూ.1,476 చెల్లించాలన్నారు.

రైతులందరికీ సబ్సిడీ వేరుశనగ

తాడిమర్రి: మండలంలో అర్హులైన రైతులందరికీ సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ చేస్తామని మండల వ్యవసాయ అధికారి రమాదేవి పేర్కొన్నారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. రైతు సేవా కేంద్రాల్లో సబ్సిడీ వేరుశనగ విత్తనం కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. విత్తన పంపిణీలో పారదర్శకత కోసం రైతు పాసుపుస్తకం ఖాతా నంబర్, ఆధార్ కార్డుల సంఖ్య నమోదు చేస్తూ రైతుల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్నట్లు తెలిపారు. మొదటి రోజు 272 మంది రైతులు 24.90 క్వింటాళ్ల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు పేర్కొన్నారు. విత్తనం కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు వచ్చే వారం నుంచి వేరుశనగ పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వీఏఏలు గౌతమి, శ్రీకాంత్‌రెడ్డి, నిజాం అహ్మద్, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలకు పేర్ల నమోదు

చెన్నేకొత్తపల్లి: ఈ ఏడాది ఖరీఫ్‌లో వేరుశనగ సాగు చేసుకొనే రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై విత్తన వేరుశనగ కాయలను పంపిణీ చేయనుంది. ఇందుకోసం రైతులు తమ పేర్లను వారి గ్రామ పంచాయతీ కేంద్రాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో పేర్లను నమోదు చేయించుకున్నట్లు మండల వ్యవసాయాధికారి ఉదయ్‌కుమార్ తెలిపారు. వేరుశనగ కావాల్సిన రైతులు పేర్లను నమోదు చేయించుకోవాలని సూచించారు. జిల్లా అధికారులు తేదీలను ప్రకటించిన వెంటనే పంపిణీ చేస్తామన్నారు. ఇప్పటిదాకా 264 మంది రైతులు నమోదు చేసుకున్నట్లు పేర్కొన్నారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం


వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో గ్రంథాలయ అధికారిణి రాజేశ్వరి

బత్తలపల్లి: విద్యార్థులు రోజూ పుస్తక పఠనం చేస్తే మేధాశక్తి పెరుగుతుందని గ్రంథాలయ అధికారిణి రాజేశ్వరి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం (సమ్మర్ క్యాంపు) ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు నిత్యం గ్రంథాలయానికి వెళ్లి దినపత్రికలు, పుస్తకాలు తదితర వాటిని చదివి విజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోండి

తాడిమర్రి: గ్రంథాలయాల ద్వారా భవిష్యత్తు బంగారు బాటలు వేసుకోవచ్చునని పశువైద్యాధికారి స్వర్ణలత విద్యార్థులకు సూచించారు. గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి డీ.శీనా నాయక్ అధ్యక్షతన గురువారం జరిగిన వేసవి శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. చిత్రలేఖనం, వక్తృత్వ, వ్యాస రచన, కథలు చెప్పడం, క్రీడా పోటీలు తదితర పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీటీ ఉపాధ్యాయులు రామకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

తనకల్లు: స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ మస్తాన్‌వలి ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన చిత్రలేఖనం, వ్యాసరచన, కథలు, క్రీడలు తదితర పోటీలలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ లైబ్రేరియన్ ఇమాంసాబ్ పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో గత 40 రోజులుగా నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం గురువారంతో ముగిసినట్లు గ్రంథాలయ అధికారి జయరాం తెలిపారు. వివిధ పోటీల్లో గెలిచిన వారికి బహుమతులను అందించినట్లు పేర్కొన్నారు.

ఎరువు తోలాలి.. పంట పండాలి


చెన్నరాయపట్నంలో పొలానికి సేంద్రియ ఎరువులను తరలిస్తున్న రైతులు

బత్తలపల్లి: ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ సాగు చేసేందుకు రైతులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మండలంలో ఇప్పటికే మూడు దఫాలుగా పదునైన వర్షం కురవడంతో దుక్కులు చేసే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. పొలాల్లోని కంది కొయ్యలు తొలగిస్తున్నారు. పలువురు సేంద్రియ ఎరువులను పొలానికి తోలుతున్నారు. గ్రామాల్లోని మహిళలు వేరుశనగ విత్తనాలను సిద్ధం చేసే పనిలో బిజీగా ఉన్నారు. వారంలో వర్షం కురిస్తే వేరుశనగ, కంది, ఆముదం, అలసంద విత్తనాలు వేస్తామని ఆయా గ్రామాల రైతులు చెబుతున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


చెన్నేకొత్తపల్లిలో ఆకట్టుకున్న చిన్నారుల చెక్కభజన

ధర్మవరం అర్బన్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించాలని వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. ఎస్‌ఐలు కేతన్న, గోపికుమార్, పోలీసులు పాల్గొన్నారు.

నల్లచెరువు: పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని మేజర్ పంచాయతీ సర్పంచ్ పంచరత్నమ్మ అన్నారు. ఎంపీడీఓ రఘునాథగుప్తా ఆధ్వర్యంలో అధికారులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏఓ రామకృష్ణ, ఈఓఆర్డీ శకుంతల, పంచాయితీ కార్యదర్శి నరేష్, స్వచ్ఛ భారత్ రీసోర్స్ కో–ఆర్డినేటర్ విశ్వేశ్వర పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

కుమ్మరవాండ్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో..

కదిరి అర్బన్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం ఎంపీడీఓ పోలప్ప ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు.పంచాయతీ కార్యదర్శి రామ్మోహన్ పాల్గొన్నారు.

బుక్కపట్నంలో..

పుట్టపర్తి: బుక్కపట్నంలోని శ్రీసత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఓబులేసు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అన్నారు. రామాంజనేయులు, సామకోటి శంకర, ఉదయ్ పాల్గొన్నారు.

ఓడీచెరువు: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల పరిదిలోని కొండకమర్ల సచివాలయం, మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాది హామీ పథకం ద్వారా ఫారంపాండ్‌లు తవ్వకం ,మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టినట్లు ఎపీఓ మంజుల, ఇసి షేక్షావలి తెలిపారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్, సాయినాథరెడ్డి, ఈశ్వర్ రెడ్డిచ పురోషోత్తం రెడ్డి, గంగాధర్, మనోహర్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు

కనగానపల్లి: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని మండల ప్రత్యేకాధికారి శ్రీదేవి తెలిపారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా పలు గ్రామాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు మొక్కలు నాటారు. ఏపీఓ వెంకటేష్‌నాయక్, పంచాయతీ కార్యదర్శి మనోహర్, సర్పంచ్ మాధవ రాజులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న స్టాళ్లు

చెన్నేకొత్తపల్లి: మొక్కలు నాటి వాటిని పరిరక్షించి బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. మండల కేంద్రానికి సమీపంలోని టింబక్టు కలెక్టివ్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఆ సంస్థ వ్యవస్థాపకులు బబ్లూ గంగూలీ, మేరివటమట్టమ్, ఎంపీడీఓ బాలకృష్ణుడు హాజరయ్యారు. వివిధ గ్రామాల నుంచి హాజరైన చిన్నారులు చెక్కభజన, కోలాటం ప్రదర్శించారు. ఏర్పాటు చేసిన స్టాల్స్ ఆకట్టుకున్నాయి.

బెస్ట్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో..


మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న బెస్ట్ యూనివర్సిటీ విద్యార్థులు, సిబ్బంది

పుట్టపర్తి టౌన్: భారతీయ ఇంజినీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ యూనివర్సిటీ సిబ్బంది ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గోరంట్ల మండల రెవెన్యూ కార్యాలయం, ఏపీఎస్‌పీడీసీఎల్ కార్యాలయం, మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం, పోలీస్టేషన్, స్థానిక వృద్ధాశ్రమాలతో పాటు పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. అనంతరం పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. పలువురు మాట్లాడుతూ.. ప్రస్తుతం వాహనాల కాలుష్యంతో పర్యావరణం దెబ్బతింటోందన్నారు. మొక్కలు నాటి భావితరాలకు పచ్చదనాన్ని అందించాలని తెలిపారు. మొక్కలు నాటి పెంచడం వల్ల భవిష్యత్తులో పచ్చదనం పెరిగి పర్యావరణాన్ని రక్షించుకోవచ్చని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

మదనపల్లె రూరల్: రోడ్డు ప్రమాదంలో కదిరికి చెందిన వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. శ్రీసత్యసాయి జిల్లా కదిరి పట్టణానికి చెందిన బాలాజీ నాయక్ (35), కుటుంబ సభ్యులు మరికొందరితో కలిసి చౌడేపల్లి మండలం బోయకొండకు వచ్చారు. మొక్కుబడి తీర్చుకుని తిరిగి స్వగ్రామానికి పయనమయ్యారు. కుటుంబ సభ్యులను వ్యానులో ఎక్కించి, బాలాజీ నాయక్ ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. మార్గమధ్యంలోని వలసపల్లె వద్ద మరో ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితుడిని మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు రెఫర్ చేశారు.